క్లుప్తంగా

నోడల్ అధికారికి ఘన సన్మానం



మరికల్: మండల నోడల్ అధికారిగా విధులు నిర్వహిస్తు బదిలీపై వెళ్తున్న రామలింగంను తోటి ఉపాధ్యాయ బృందం శనివారం ఘనంగా సన్మానించారు. మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలను సందర్శించి ఉపాధ్యాయులకు బోధన విషయంలో పలు సూచనలు, సలహాలు అందజేశారు. హెచ్ఎం దత్తాత్రి, లక్ష్మీ, సదన్‌రావు, సురేష్, సీఆర్‌పీ శివ కుమార్, ప్రవీన్ పాల్గొన్నారు.

జిల్లా గౌడ సంఘం కార్యవర్గం రద్దు

నారాయణపేట: పేట జిల్లా గౌడ సంఘం కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్. మనోహర్‌ప్రసాద్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే గౌడ సంఘం జిల్లా సమావేశాన్ని నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్నట్లు తెలిపారు.

రేపు సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపికలు

మరికల్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న మండలంలోని సబ్‌జూనియర్ బాల, బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడాకారుల ఎంపికకు ముఖ్యఅతిథిగా శాంతికుమార్ హాజరవుతారన్నారు. ఎంపికైన క్రీడాకారుల టీంలు ఈ నెల 16 నుంచి 19వరకు సూర్యపేట జిల్లాలోని చింతలపాలెంలో జరిగే 16వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9908933353, 9985523534కు సంప్రదించాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మరికల్: మండలంలోని చిత్తనూర్‌లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులతో ప్రత్యేక అధికారి గోపాల్‌రావు, ఎంపీటీసీ దేవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కేటాయించిన సీసీరోడ్డు పనులను నాణ్యతగా చేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణయ్య, మండల అధ్యక్షుడు వీరన్న హరిష్‌రెడ్డి, శ్రీనివస్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, మనివర్ధన్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ



ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లిలో శనివారం నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కతలప్ప, చంద్రప్ప, కృష్ణంరాజు, బీమప్ప, ఆంజనేయులు, లక్ష్మన్, శంకరప్ప, రాములు పాల్గొన్నారు.

నేడు పూసల్ పహాడ్ టాలెంట్ టెస్ట్

కోస్గి: గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి వారిని ప్రొత్సహించేందుకు నేడు ఆదివారం పూసల్ పహాడ్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శేరి కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ అంజిలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ పరీక్షను అన్ని మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని, ప్రతి సంవత్సరం పదోతరగతి విద్యార్థులకు నిర్వహించే ఈ పరీక్షకు మండల పరిధిలోని పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంల వద్ద పేర్లు నమోదు చేసుకున్న వారు పరీక్షకు హాజరు కావాలన్నారు. కోస్గి ప్రభుత్వ జూనియర్ కళాశాల, సర్జఖాన్‌పేటలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

వైజ్ఞాన దృక్పథంపై అవగాహన

నారాయణపేట రూరల్: మూఢనమ్మకాలు, వైజ్ఞాన దృక్పథం అనే అంశంపై శనివారం స్థానిక స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన దర్శిని వ్యవస్థాకులు రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సైన్స్ అభివృద్ధి చెందుతున్న సందర్భంలో మూఢనమ్మకాల వైపు గ్రామీణ ప్రజలు ప్రయాణించడం బాధాకరమన్నారు. బాల్యవివాహాలను నిషేదించడం, దయ్యాలు లేవనే విషయంపై చైతన్య పర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ పద్మావతి, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి నరహరి, డాక్టర్ కార్తిక్, వెంకట్రామారెడ్డి, డీవైఎఫ్ఐ నాయకులు మహ్మద్ అలీ, పవన్ పాల్గొన్నారు.

బృహత్ వనాలు వెలవెల

- నిర్వహణ లేక ఎండుతున్న మొక్కలు
- మండలంలో 5పల్లె ప్రకృతి వనాలు
- వాచర్లుగా ఉపాధి కూలీలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



బృహత్ పల్లె ప్రకృతి వనం ముఖద్వారం (ఫైల్)



నిర్వహణ లేక బోసిపోయిన కందెన్‌పల్లి బృహత్ పల్లె ప్రకృతి వనం (ఫైల్)

దామరగిద్ద: పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని కాపాడే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రతి మండలంలో ఎంపిక చేసిన గ్రామాల పరిధిలో నిర్మించిన బృహత్ పల్లె ప్రకృతి వనాలు పర్యవేక్షణ లోపంతో వెలవెలబోతున్నాయి. మండలంలో కందెన్‌పల్లి, బాపన్‌పల్లి, విఠలపూర్, సజనాపూర్, అయ్యవారిపల్లి గ్రామాల్లో బృహత్ పల్లె ప్రకృతి వనాలను మంజూరు చేసి నిర్మించారు. స్థల సదుపాయాలన్ని బట్టి 35వేల వరకు మొక్కలను నాటారు. కందెన్‌పల్లిలో 10ఎకరాల స్థలంలో 35వేలు, బాపన్‌పల్లి గ్రామంలో 5ఎకరాల్లో 250 మొక్కలు, విఠలపూర్ గ్రామంలో 3ఎకరాల్లో 8వేల మొక్కలు, సజనాపూర్‌లో 1.5 ఎకరాల్లో 4500 మొక్కలు, అయ్యవారిపల్లి గ్రామంలో 2ఎకరాల్లో 500 మొక్కలు మాత్రమే నాటారు. అయ్యవారిపల్లిలో ప్రకృతివనం నిర్మాణం మధ్యలో నిలిచిపోగా, బాపన్‌పల్లిలో సరైన రోడ్డు సదుపాయం లేక మొక్కలకు నీటి సదుపాయం కల్పించడానికి నీటి ట్యాంకర్ వెళ్లలేని దుస్థితి నెలకొందని అధికారులు చెబుతున్నారు. ఆయా నర్సరీలో నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత గ్రామ పంచాయతీలు తీసుకొని బృహత్ వనాలను సంరక్షించాల్సి ఉంది. మొక్కలు లేని చోట తిరిగి మొక్కలను నాటి సంరక్షణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిర్వహణ బాధ్యత పంచాయతీలదే..



మండలంలోని 5 గ్రామ పంచాయతీల పరిధిలో నిర్మించిన బృహత్‌పల్లె ప్రకృతి వనాల్లో 10 లక్షల వ్యయంతో 48,520 మొక్క లు నాటాం. రెండేళ్ల పాటు ఈజీఎస్ ద్వారా నిర్వహణ చేపట్టాం. ఆ తరువాత గ్రామ పంచాయతీల ద్వారా బాధ్యత వహించి ప్రకృతి వనాలను సంరక్షించుకోవాలి. మొక్కలు లేని చోట తిరిగి మొక్కలను నాటి బతికించాలి.

– శ్రీధర్, ఎంపీడీఓ, దామరగిద్ద

ఆలయానికి వెండి ఆభరణాల వితరణ

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి దాతలు రూ. 30వేల విలువైన వెండి ఆభరణాలు వితరణ చేసినట్లు అర్చకులు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం దాతలు హేమలత జగదీశ్వర్‌రెడ్డి, ఎన్ఆర్ఐ ప్రియాంకశ్రీనివాస్‌రెడ్డి ఈ ఆభరణాలను అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి ఆకులపూజ, మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం దాతలను, గతంలో రూ. 15 విలువైన వెండి అభరణాలను దొంగతనానికి గురి అయితే వాటిని తిరిగి తీసుకురావడంలో కృషిచేసిన ఎస్ఐ కురుమయ్యను, కానిస్టేబుల్ వేణుగోపాల్‌ను అర్చకులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎస్ఐను సత్కరిస్తున్న దాతలు

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కృష్ణా: మండలంలోని ముడుమాల్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌గా ముభీనా, డీఈఓగా శృతి, ఎంఈఓగా నందిని, హెచ్ఎంగా గణేష్, సర్పంచ్‌గా సిద్ధలింగమ్మ, పాఠశాల చైర్మన్‌గా హన్మంతు వ్యవహరించి ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హెచ్ఎం నిజాముద్దీన్ బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులకు, గ్రామానికి, పాఠశాలకు మంచిపేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమలో ఉపాధ్యాయులు, ఆనంద్, కవిత, రేణుకా, శివయోగి, అపురూప, లక్ష్మీ, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రూ.213 కోట్ల నిధులు మంజూరుపై హర్షం

కోస్గి: సీఎం రేవంత్ తనసొంత నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం కోసం రూ.213 కోట్లు మంజూరు చేస్తూ జీఓ విడుదల చేయడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏర్పాటుచేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గుర్తించిన 30 పనుల కోసం ఈ నిధులను రాష్ట్ర గ్రామీణ పంచాయతీ అభివృద్ధి శాఖ మంజూరు చేసిందన్నారు. రెండు నెలల వ్యవధిలోనే ఇంజనీరింగ్ కళాశాల, డిగ్రీ కళాశాల, విశ్వవిద్యాలయంతోపాటు పలు రకాల విద్యా సంస్థల కోసం జీఓలు ఇచ్చి చేపడుతున్న పనులు విమర్శలు చేస్తున్న నాయకులకు కనిపించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు భానునాయక్, ఇద్రీస్, మాస్టర్ శ్రీను, నర్సింహులు, మల్లేష్, విద్యాసాగర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

యువక మండలి సేవలు ఆదర్శనీయం

మరికల్: సమా సమాజం నిర్మాణం కోసం మండల యువక మండలి సభ్యులు చేస్తున్న సేవలు ఆదర్శనీయమని మాజీ సర్పంచ్ గోవర్ధన్ అన్నారు. స్వామి వివేకానంద జయంతోత్సవాల సందర్భంగా నిర్వహించిన క్రీడ, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు శనివారం రాత్రి బాలుర ఉన్నత పాఠశాల్లో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్, రఘు, నవీన్, సంతోష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న నాయకులు

సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం



మరికల్‌లో చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మరికల్: నారాయణపేట –కొడంగల్ ఎత్తిపోతలకు సీఎం రేవత్‌రెడ్డి నిధులు మంజూరు చేయడంతో శనివారం మండలంలోని ఇందిరాగాంధీ చౌరస్తాలో పట్టణ అధ్యక్షుడు హరిష్‌కుమార్ ఆధ్వర్యంలో సీఎం, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కుంభం శివకుమార్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల వ్యవధిలోనే దశాబ్దాల కలను నిజం చేశారని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వీరన్న, పట్టణ అధ్యక్షుడు హరిష్, కృష్ణయ్య, వినితమ్మ, సత్యన్నా, శ్రీకాంత్, ఆంజనేయులు, రామకృష్ణ, రామకృష్ణారెడ్డి, మహేష్, మల్లయ్య, అంజిరెడ్డి పాల్గొన్నారు.

ధన్వాడ: 69 జీఓ అమలు చేయడంపై మండల కేంద్రంలోని కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నారాయణపేట –కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగు నీరు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు నరహరి, ఆనంద్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, యుసుఫ్, శంకర్, రాచంద్రయ్య, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.



ధన్వాడలో..

సీఐకి ఘన సన్మానం

నారాయణపేట రూరల్: నారాయణపేట నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన భగవంత్‌రెడ్డిని శనివారం వివిధ పార్టీలు, సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శాలువా, పూలమాలతో సన్మానించగా, సీఐటీయూ నాయకులు పూలమొక్క అందించి స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో మనోహర్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకట్రామారెడ్డి, జోషి పాల్గొన్నారు.

లైసెన్స్ తప్పనిసరి



మాగనూర్: వాహనాదారులు ధ్రువీకరణ పత్రాలతోపాటు లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్ఐ మల్లేష్ కోరారు. శనివారం మండల కేంద్రం సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్రవాహనారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్ చలాన్ చెల్లించాలని లేకపోతే వాహనాలు సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

కో- ఆప్షన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ



దామరగిద్ద: మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండి ఉస్మాన్ మృతితో ఖాళీ అయిన కో ఆప్షన్ స్థానాన్ని భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసిందని ఎంపీడీఓ శ్రీధర్ తెలిపారు. శనివారం మండల అఖిల పక్ష నాయకుల సమావేశం నిర్వహించి నోటిఫికేషన్ వివరాలను వెల్లడించారు. 15న ఎన్నికలు నిర్వహించి రిటర్నింగ్ అధికారి సమక్షంలో ఎన్నిక పూర్తిచేయనున్నట్లు తెలిపారు. అఖిల పక్షనాయకులు ఎన్నికల నిర్వహణలో పాల్గొనాలని తెలిపారు.

ఆనంద్‌మేళా ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక వేపురిగేరిలోని భీమలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం రాజస్థాని మహిళా మండలి ఆధ్వర్యంలో ఆనంద్‌మేళా ప్రారంభించారు. ఈ మేళాను బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్ పరిశీలించి మహిళలు తయారీ చేసిన వంటకాలు, కళాకృతులు బాగున్నాయని అన్నారు. కాగా, వీరు ప్రదర్శించిన వాటిలో కిరణ్‌గుప్తా, జెమున ఆర్‌మేట్ తదితరాలు ఉన్నాయి.

కంకర తేలిన రోడ్డుతో నరకం..



చర్లపల్లికి వెళ్లేదారిలో తేలిన కంకర

ధన్వాడ: మండలంలోని కొండాపూర్ నుంచి హన్మన్‌పల్లి, చర్లపల్లి గ్రామాల వరకు వెళ్లే బీటీరోడ్డు కంకర తేలి వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీటీ వేస్తామని అధికారులు చెప్పడం తప్ప రోడ్డు మాత్రం వేయడం లేదని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే హన్మన్‌పల్లి గ్రామం నుంచి మడిగెలమూలతండా వరకు కంకర వేసి వదిలేశారు. గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రజలు నిత్యం నరక యాతన పడుతు మండల కేంద్రానికి వస్తున్నారు. అధికారులు స్పందించి బీటీ వేయాలని కోరుతున్నారు.

వయో పరిమితి ఐదేళ్లు పెంచాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఐదేళ్లు వయోపరిమితి పెంచాలని తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మెట్టయాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఢిల్లీలో రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లురవికి వినతిపత్రం సమర్పించారు. సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఉమేష్‌కుమార్, నాయకులు సంతోష్ కుమార్, సంపత్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట రూరల్: ప్రతి గ్రామం చైతన్యవంతమై సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే మరింత భద్రత లభిస్తుందని రూరల్ పోలీసు బృందం సభ్యులు అన్నారు. శనివారం మండలంలోని కోటకొండలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తుపదార్థలు తీసుకోవడంతో కలిగే అనర్థాలను వివరించారు. అదేవిధంగా సైబర్ నేరాల వలలో పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహన డ్రైవింగ్ సమయంలో హెల్మెట్, సీట్‌బెల్టు ధరించాలన్నారు. అనుమానితులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, రుక్యానాయక్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేద్దాం



మున్సిపల్ సిబ్బందికి సమ్మెనోటీసును అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు కిరణ్

మక్తల్: దేశవ్యాప్త ఈ నెల 16న జరిగే సార్వత్రిక సమ్మె గ్రామీణబంద్‌ను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కోరారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సమ్మెనోటీసును కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే దేశవ్యాప్తంగా సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెంటనే నాలుగు కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఈశ్వరయ్య, ఉపాధ్యాక్షుడు కోలిమి రాముఉల, గంగన్న, ఆశన్న, రవి, మహేశ్వరమ్మ, రామలింగం, హన్మంతు, మారుతి, వెంకటేస్, మారెప్ప, బాబు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



దామరగిద్దలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

దామరగిద్ద: కేంద్ర ప్రభుత్వ రైతాంగా వ్యతిరేక విధానాలకు దేశవ్యాప్తంగా చేపట్టనున్న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేద్దామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ అన్నారు. ఈ నెల 16న చేపట్టనున్న గ్రామీణ బంద్ వాల్‌పోస్టర్‌లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లాభసాటి వ్యవసాయం చేపడతామన్న కేంద్రం ఎరువులు పురుగుమందు ధరలు పెంచి మద్దతు ధరలు మాత్రం పెంచడం లేదన్నారు. నల్ల చట్టాలను రద్దు చేసిందని స్వామి నాథన్ సిపారసులను అమలు చేయాలని కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయుకులు పాల్గొన్నారు.

వైద్య విజ్ఞాన సదస్సు విజయవంతం

నారాయణపేట రూరల్: స్థానిక శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన వైద్యవిజ్ఞాన సదస్సు విజయవంతమైంది. మహబూబ్‌నగర్ శ్యామల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ప్రణయ్, కార్తిక్ గందెలు ముఖ్యఅతిథులుగా హాజరై ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చారు. వివిధరకాల రోగాలకు సంబంధించి నివారణ విషయాలను తెలియజేశారు. గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్‌పై చేయు విధానం వివరించారు. సమావేశంలో రమేష్, శ్రవణ్, నర్సింగ్, జమీర్‌పాషా, చింతలయ్య, గోపాల్, వెంకట్రాములు, ఖాసీం, నాగమణి, సబిత ఉన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రణయ్

ఆలయంలో హనుమాన్ చాలీసా పఠనం

మరికల్: మండల కేంద్రంలోని హనుమాన్‌వాడ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం రాత్రి నుంచి హనుమాన్ చాలీసా పఠనం ప్రారంభించారు. ప్రతి శనివారం రాత్రి భజన కార్యక్రమాలతోపాటు హనుమాన్ చాలీసా పఠనం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో యువకులు, భజనపరులు పాల్గొని హనుమాన్ చాలీసా పఠనం చేయాలని కోరారు.



ఆలయంలో చాలీసా పఠనం చేస్తున్న భజన మండలి సభ్యులు

మూతపడిన అంగన్‌వాడీ కేంద్రం

కృష్ణా: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు ఎప్పుడు తెరుస్తారో, ఎప్పుడు మూసి ఉంటారో తెలియడం లేదు. అంగన్‌వాడీ సెంటర్లపై అధికారుల పర్యవేక్షణ లేక అక్కడి సెంటర్లు ఎప్పుడూ మూతపడే ఉంటాయని గ్రామస్తులు అంటున్నారు. శనివారం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్ ఉదయం నుంచి మూసి ఉండడంతో ఆ సెంటర్‌కు వచ్చే చిన్నారులు ఇబ్బందులకు గురయ్యారు. ఏది ఏమైన గ్రామంలో చాలా కాలంగా సెంటర్లు పనిచేయడం లేదని, అంగన్‌వాడీ టీచర్లు తమకు ఇష్టం వచ్చిన సమయంలో సెంటర్లను తెరుస్తారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మూతపడ్డ అంగన్‌వాడీ సెంటర్

మూడునెలలకే తహసీల్దార్ బదిలీ

మహబూబ్‌నగర్ రూరల్: విధుల్లో చేరినఅతి స్వల్ప కాలంలోనే మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ రాధాకృష్ణ జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీ అయ్యారు. అయితే విధులలో చేరిన కొన్నాళ్లకే ఆయన బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. మూడు నెలల కాలంలోనే బదిలీ అయిన ఆయన స్థానంలో ప్రస్తుతానికి ఎవరిని నియమించలేదు.

నర్సరీ పనులు వేగవంతం చేయాలి

కోయిల్‌కొండ: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను పెంచేందుకు చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ జయరాములు సూచించారు. శనివారం పారుపల్లిలో నర్సరీ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కార్యదర్శులు దృష్టిసారించాలని సూచించారు. ఏపీఓ నర్సయ్య పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు